కోటి ఆశలతో...


న్యూ ఇయర్‌కు వినూత్నంగా మామిడికుదురు విద్యార్థుల స్వాగతం


మలికిపురంలో చిన్నారులకు చిత్రాన్ని ప్రదర్శిస్తున్న సంగీత్

- న్యూ ఇయర్‌కు వినూత్న స్వాగతం
- రంగవల్లులతో కళకళలాడిన వీధులు
- కిటకిటలాడిన హోటళ్లు, బేకరీలు

మామిడికుదురు: 2025 న్యూ ఇయర్‌కు మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం వినూత్నంగా స్వాగతం పలికారు. 2025 అక్షరాలుగా ఏర్పడి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ విద్యార్థులు సందడి చేశారు. హెచ్‌ఎం సీహెచ్ నిరంజని, పీఎంసీ చైర్మన్ వేగి శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. నూతన సంవత్సరంలో విద్యార్థులు కష్టపడి చదువుకుని అన్ని రంగాల్లోనూ మంచి ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న సంగీత్ న్యూ ఇయర్ చిత్రం

మలికిపురం: మలికిపురం సునయన ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్, చిత్రకారుడు నల్లి సంగీత్ గీసిన న్యూ ఇయర్ చిత్రం స్థానిక చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు సంతోషంగా కలర్ బెలూన్‌లతో పరుగెడుతున్నట్లుగా కూల్ కలర్స్, హ్యాపీ కలర్స్‌తో ఈ పెయింట్ రూపొందించారు. మంగళవారం అకాడమీలో విద్యార్థులకు సంగీత్ తన చిత్రాన్ని ప్రదర్శించారు.

నూతన సంవత్సర వేళ పోలీస్ స్పెషల్ డ్రైవ్

కొత్తపేట: నూతన సంవత్సరం ఆరంభ వేళ ముందస్తు చర్యల్లో భాగంగా రావులపాలెం సర్కిల్ పరిధిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఉత్తర్వుల మేరకు కొత్తపేట డీఎస్పీ గోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్సైలు రాబోయే నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు చర్యల్లో భాగంగా ఆత్రేయపురం మండలంలో ఎస్సై రాము, కొత్తపేట మండలంలో వివిధ రహదారుల్లో ఎస్సై జి.సురేంద్ర అనుమానిత వాహనదారులను ఆపి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపరాదని, మంగళవారం రాత్రి 10 గంటల తర్వాత ఎవరూ కూడా రోడ్లపై తిరిగడం గాని, మద్యం తాగి వాహనాలు నడపడం గాని, రోడ్ల మీద కేక్ కటింగ్ చేయరాదని సోషల్ మీడియా ద్వారా హెచ్చరించారు. ఈ నింబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

రాజేంద్రప్రసాద్ సేవలు అద్వితీయం


రాజేంద్ర ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన అరసాల రాజేంద్రప్రసాద్ అందించిన సేవలు అద్వితీయం, అనిర్వచనీయమని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఐడీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కార్యాలయం ఆవరణలో మంగళవారం హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అభినందన సభ జరిగింది. సుమారు నాలుగు దశాబ్దాలుగా విధి నిర్వహణలో రాజేంద్రప్రసాద్ ప్రజలకు అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం రాజేంద్రప్రసాద్ దంపతులకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది శాలువా, పూల మాలలు వేసి బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఎస్సై పి.రాంబాబు, యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


మలికిపురం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖాధికారులు విజయశ్రీ, వైవీ సత్యనారాయణ పేర్కొన్నారు. గత నెల 24న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన యువ మార్పు తయారీదారుల సదస్సుకు మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థినులు పెనల భువన సాధిక, నల్లి రోజిలిన్‌ల ప్రాజెక్ట్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమక్షంలో ప్రదర్శన ఇచ్చి ప్రసంశలు పొందారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో మంగళవారం అభినందన సభ జరిగింది. సమావేశంలో మలికిపురం మండల ఎంఈవోలు, విశ్వేశ్వరాయపురం సర్పంచ్ హెలీనా విద్యార్థులను అభినందించారు. ఎంఈవోలు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చూపిన వివేకానంద స్కూల్ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉజ్వలంగా రాణించాలని ఆకాంక్షించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈవోలు విజయశ్రీ, సత్యనారాయణ తదితరులు

4న సర్వసభ్య సమావేశం

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జనవరి 4 ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కేవీ ప్రసాద్ తెలిపారు. బడ్జెట్ సమావేశం కూడా జరుగుతుందని ఆయన వివరించారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి


సీఐ భీమరాజు

అంబాజీపేట: నూతన సంవత్సరం, సంక్రాంతి పండగల వేళ సైబర్ మోసగాళ్లు సరికొత్త మోసాలకు సిద్ధమయ్యారని వారి పట్ల అప్రమత్తంగా ఉండి ఎవరూ మోసపోవద్దని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అన్నారు. ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్) ఫైల్స్ రూపంలో మెసేజీలు పంపిస్తున్నారని, పొరపాటున వాటిపై క్లిక్ చేస్తే మన ఫోన్‌లో సమాచారం అంతా నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుందని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదన్నారు. గుర్తు తెలియని నంబర్ల ద్వారా వచ్చే ఈ లింక్‌లను, ఫోన్‌లను ఏ మాత్రం క్లిక్ చేసినా బ్యాంకు ఖాతాలోని నగదు క్షణాల్లో మాయం చేస్తారన్నారు. బ్యాంకు, స్నేహితులు, బంధువుల నుంచి లింక్‌లను ఎవరూ పంపరని, ఒకవేళ అనుమానం వస్తే నేరుగా బ్యాంకులకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దన్నారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా 'దాకే'

పి.గన్నవరం: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కమీషన్ జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నాగుల్లంక గ్రామానికి చెందిన దాకే శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆసంస్థ జాతీయ అధ్యక్షుడు హెచ్‌ఎండీ ముజాహిద్ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు నారాయుడు, జాతీయ అధ్యక్షుడు ముజాహిద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

కొత్తపేట: విశ్వహిందూ పరిషత్, వివిధ క్షేత్రాలతో జనవరి 5న విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభకు లక్షలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా ఇంకా దేశంలో హిందూ దేవాలయాలు స్వతంత్రతను పొందలేదన్నారు. తమ దేవాలయాలు తామే నిర్వహించుకొనుటకు స్వయం ప్రతిపత్తి లేదని స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయాల సంపదలు, ఆస్తులు, ఆభరణాలు, భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చారని, దేవాలయాలు, హిందూ సమాజం నిరంతరం దాడులకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ మారాలంటే హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ప్రకటించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

అంబాజీపేట: భూ కబ్జాల నుంచి సామాన్యులకు రక్షణ, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. మొసలపల్లిలో రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు అంకితభావం జవాబుదారీ తనంతో పారదర్శకంగా నిర్వహించి భూ సమస్యలకు చెక్ పెట్టాలన్నారు. ఎవరైన భూ సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. అంతకుముందు అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, శాశ్వత రికార్డుల కౌంటర్లను తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సదస్సులో ఆర్ఐ కె.ఏడుకొండలు, స్థానిక నాయకులు దంతులూరి శ్రీనురాజు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోపాల సవరణకు గడువు ఇవ్వాలి

అంబాజీపేట: కులగణనకు సంబంధించి అధికారులు ప్రచురించిన జాబితాలో లోపాలు ఉన్నాయని తక్షణమే వాటిని సవరించేందుకు గడువు ఇవ్వాలని అంబాజీపేట మండల మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. అంబాజీపేటలో మండల మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీవీ సరోవర్‌కు మంగళవారం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో కులగణన జాబితాను గత నెల 28న ప్రచురించారన్నారు. అయితే ఆయా పంచాయతీల వద్ద కులగణనకు సంబంధించిన జాబితా అందుబాటులో ఉన్నట్లు ఎటువంటి సమాచారం గాని, ప్రసారం చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగాబత్తుల నరసింహమూర్తి, నెల్లి వెంకటరమణ, ముత్తాబత్తుల ప్రశాంత్, చింతపల్లి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల సుధాకర్, బీర సురేష్ ఉన్నారు.

శ్రీనివాసులు నియామకంపై హర్షం

అంబాజీపేట: దివ్యాంగుల మహా సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా దొడ్డిపట్ల శ్రీనివాసులు నియామకంపై జిల్లా శాలివాహన సంక్షేమ సంఘ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాసులతో పాటు జాతీయ అధ్యక్షులుగా నందూరి రమేష్, నిమ్మకాయల సురేష్‌లను నియమించడంతో అభినందించారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సంఘ అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సైన్స్‌పై అభిరుచిని పెంచుకుని ప్రయోజకులు కావాలని అభిలషించారు. హెచ్‌ఎం గాడేపల్లి నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వార్డు సభ్యులు బి.సత్యనారాయణ మూర్తి, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయినవిల్లి: సైన్స్ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడుతోందని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) కె.సలీంబాషా అన్నారు. మంగళవారం స్థానిక ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన పోటీలను మండల స్థాయిలో నిర్వహించారు. ఈ ప్రదర్శనలు ఎంఈఓ-1 కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించగా స్థానిక ఎంపీపీ మట్టపర్తి నాగవెంకటలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావులు పారంభించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇటువంటి ప్రదర్శన వల్ల చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విలస, చింతనలంక, జగన్నాథపురం పాఠశాలల విద్యార్థులకు మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు.


లూటుకుర్రు ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ తాతకాపు































